

# కాలమ్ దాటని కబుర్లు

**బలభద్రపాత్రుని రమణి**



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### "ఆజా బచ్‌పన్.."

**మనం మరిచిపోతు**న్నది, చిన్నతనపు రోజుల్లో ముఖ్యమైనది. డాబా మీద ఆరుబయట మంచాలు వేసుకుని వాటికి దోమతెరలు వేసుకోవడం. వెన్నెల సరాసరి పక్కల మీదకి ఒలికి చల్లగా మంచులా అయ్యాకా, మల్లెపూల గాలి, సన్నజాజి తీగ గాలికి కదులుతూ వీచే పరిమళాలతో, వెన్నెల్లో, ఆకాశంలో చందమామని వెల్లకిలా పడుకుని చూడడం. అందులో రాట్నం వడికే ముసలమ్మనీ, కుందేలునీ చూస్తూ, చుక్కలు లెక్కపెడ్తూ పడుకోవడం ఓ మధురానుభూతి.

అప్పుడు అమ్మమ్మ పక్క మంచమ్మీద పడుకుని పేదరాశి పెద్దమ్మ కథలు చెప్తుండేది. మంత్రపు దీవులూ.. అందులో రెక్కల గుర్రాలూ, ఎగిరే తివాచీలూ, ఒక దీవినుండి ఇంకొక దీవికి నోట కరుచుకు వెళ్ళి దింపే గండ భేరుండ పక్షులూ, ఒంటి కంటి రాక్షసులూ. భయంతో దుప్పటి ముసుగు పెట్టి గడ్డ కట్టుకుపోవడం. ఎంత బావుండేదో. మధ్య రాత్రి అమ్మ, దుప్పటినిండా కప్పడం, మనం లేచి కూర్చుంటే "గొంతు ఎండిపోయిందా? ఓ చుక్క మంచినీళ్ళు తాగు" అని పక్కనే వున్న కూజాలోంచి నీళ్ళు ఒంపి తాగించడం. ఇంకా ఒక్కోసారి "అమ్మా నిద్రపట్టడంలేదు" అంటే "అన్నాలు తినేటప్పుడు ఆపోలేదు. కబుర్లతో కడుపులు నింపేసుకున్నారు. ఉండండి" అని వెళ్ళి పెరుగన్నం కలుపుకొచ్చి మాగాయ ముక్క నంజి ముద్దలు పెట్టడం. అవన్నీ గానుగ చెట్టుకి గిజిగాడి గూళ్ళలా ఊగుతూ, గత జన్మని తట్టి లేపుతున్న మేల్కొలుపుల్లా, ఓ నాటి వాన తాలూకు, మట్టి వాసనల్లా వట్టి వేళ్ళ తడికల సువాసనల్లా, మనసు తలుపుల్ని తడ్తుంటాయి. పెరట్లో చెట్లకి అరమగ్గిన మావిడి పండ్లు, గడ్డిపరిచిన గంపల్లో సర్ది, రోజూ పొద్దునే మొహం కడుక్కుని వెళ్ళి, పసుపు బారి బంగారపు రంగులో మెరుస్తున్న వాటిని ఏరుకుని తెచ్చుకునేవాళ్ళం.

వత్తులు చెయ్యాలంటే, పెరట్లోకెళ్ళి పత్తికాయలు కోసుకొచ్చి మధ్యాహ్నాలు అమ్మమ్మతో కలిసి వత్తులు చెయ్యడం, పప్పుచారు కాస్తుంటే అమ్మ, కరివేపాకు రెమ్మ తనంతట తనే వంటింటి కిటికీ దగ్గరగా ఒంగి చిరునవ్వు నవ్వడం ఉదయం పూజకి తామే నేల రాలిన పారిజాతాలు మొహంమంతా ఎరుపు చేసుకుని ఎదురు చూడడం నిద్రగన్నేరులూ, రాధామనోహరాలూ, చంద్రకాంతలూ, దేవ కాంచనాలూ, నంది వర్ధనాలూ, గరుడ కాంభోజిలూ, కాశీ రత్నాలూ, జూకా మందారాలూ, నూరు వరహాలు పచ్చగన్నేరూ, సజ్జ నిండిపోయేటన్ని పూలు దేవుడి మందిరం అంతా అలంకరిస్తే, అమ్మ చేసే

కమ్మని పొంగలి ఘుమఘుమలు, హారతి కర్పూరం వాసనలతో తులసి ఆకు వేసిన తీర్థంతో, వేణువూదే క్రిష్ణయ్యా, సీతారామాంజనేయ పట్టాభిషేకం, లక్ష్మీదేవి నారాయణ మూర్తీ, అన్నింటికి ముందుండే బొజ్జ గణపయ్యా, శంఖం వూదితే, వచ్చేనే భోళాశంకరుడూ... పూజగది కళకళలాడిపోయేది.

పెరట్లో మరువం దవనం, పోటీ పడ్తూ పూసిన కనకాంబరాలూ, రోజాపూలూ రోజుకొకళ్ళం మాలలు కట్టి, స్కూల్లో టీచర్‌కి ఇవ్వడానికి పోటీపడేవాళ్ళం. మా ఇంట్లో మావిడి చెట్టుంటే, చిట్టత్తయ్య ఇంట్లో దబ్బచెట్టు, పక్కింట్లో జామచెట్టూ, ఎదురింట్లో బాదం చెట్టూ, పిల్లలం ఓ చెట్టుమీద నుండి ఇంకో చెట్టుకి ఎగురుతూ కాయలు కోసుకునే వాళ్ళం.

సాయంత్రాలు వీధుల్లో పరుగులు పెట్టి ఆటలాడి గస పోసుకుంటూ, ఎవరింట్లోనో చెంబుడు నీళ్ళు గడగడా తాగుతుంటే, తాత బండి కారం బూందీ, అటుకుల చివుదా, బెల్లం జిలేబీలూ, లడ్డూలూ, సన్నకారప్పూసా, మైసూర్ పాకులూ ప్లేట్లలో తీర్చిదిద్ది, గంట కొట్టుకుంటూ మా బజార్లోకి వచ్చేది. ఐదు పైసలు పెడితే కారం బూందో, బెల్లం జిలేబీనో ఆకులలో పెట్టేవాడు. కొన్నాళ్ళు పఠాను ఒకతను, తన ఇద్దరు పిల్లలకీ ఒకేలాంటి కోటూ, పైజమాలు వేసి, తలపాగాలు పెట్టి, చాంద్ బిస్కెట్‌లూ, కేకులూ, కాఫీ టాఫీలూ అమ్మే బండితో వాకిట్లోకి వచ్చేవాడు. పొరలు పొరలుగా విడిపోయే బిస్కెట్లు ఎంత విచిత్రంగా అనిపించేవో.

సాయంత్రాలు పూల వాళ్ళ అమ్మకాల హోరుతో బజారు గుప్పుమనేది. భోజనాలు అయి అరుగుల మీద కూర్చుని అమ్మావాళ్ళు కబుర్లాడుతుంటే, వెన్నెల్లో పిల్లలమంతా పరుగెత్తి ముట్టించుకునే ఆటలు ఆడేవాళ్ళం. తప్పకుండా కరెంట్ పోయేది. అయినా వెన్నెల పడి రోడ్డు తళతళలాడేది. అప్పుడు "ఆంధ్రా సోడా.. తాగిపోరా మెల్లగా, ఓ పిల్లగా" అంటూ సోడా బండి రామయ్య వచ్చేవాడు. ఆ సోడా కొడ్తుంటే ఆ తమాషా శబ్దం వినడం ఎంత ఇష్టంగా వుండేదో. కొందరు వాడికగా రోజూ సోడా తాగేవాళ్ళు. మేం కలర్ సోడాకి ఆశపడేవాళ్ళం. కొన్నిసార్లు నల్ల ఉప్పూ, నిమ్మరసం పిండి నిమ్మకాయ సోడా కొట్టి ఇచ్చేవాడు గ్లాసులో పోసి. అదెంత బావుండేదో..

ఇలా టీ.వీలు లేని అందమైన బాల్యం, ఇంట్లో ఎండవేళ పిల్లలందరం వామనగుంటలో, వైకుంఠపాళీ, చింత పిక్కలో, గచ్చ కాయలో ఆడేవాళ్ళం. పెద్దవాళ్ళు కూడా సాయంత్రాలు టీ తాగుతూ, లిటరేచర్‌లాంటి ఆటలూ, లేదా బయట బాడ్మింటన్‌లాటివీ ఆడుకునేవాళ్ళు. ఇంక చల్లపాటివేళ అయితే పరుగులకీ, ఆటలకీ అప్పుడే పేడ నీళ్ళు జల్లి ముగ్గులు పెట్టిన, పచ్చని లోగిళ్ళు ధనధనలాడేవి. ఎప్పుడైనా ఏ కీలు గుర్రానికో, పాతాళభైరవికో, సంపూర్ణరామాయణంకో, ఆదివారం మార్నింగ్ షోకి పిల్లలందరం కలిసి వెళ్ళేవాళ్ళం. తంపటేసిన వేరుసెనగపప్పో, సాతాళించిన శెనగలో కొనుక్కు తింటూ సినిమా చూడడం, అందులోనూ స్నేహితులతో ఎంత బావుండేదీ? అన్నీ బోలెడు రూపాయలు పోసి కొనుక్కురావడం కాదు.

సంక్రాంతొస్తే, రంపపు పొట్టు తెచ్చి ఆకుపచ్చరంగు కలిపి గడ్డి తయ్యారు చేసి, మెంతులూ, పెసలూ మొలకలెత్తించి పైరుల్లా వేసి, బోలెడు బొమ్మలు పెట్టి కొలువు తీర్చేవాళ్ళం. ఒకళ్ళం పంటపొలాలు వేస్తే, ఇంకోళ్ళు సినిమాహాలు తయ్యారు చేసేవాళ్ళు. ఐస్‌క్రీం పుల్లలతో కుర్చీలు చేసి, ఇంక ఆ బొమ్మలన్నీ తీసి, వాటికి మళ్ళీ రంగులేసి, రిపేర్లు చేసి, ఎంతటి సందోహం? రోజూ పేరంటం.

దీపావళి వస్తే సూరేకారం, భాస్వరం తెచ్చి పొట్లాలు కట్టడం, చిచ్చుబుడ్లూ తారాజువ్వలూ, నాన్నలూ, అన్నయ్యలూ కూర్చుని చెయ్యడం...


వినాయక చవితొస్తే పత్రి కోసుకుని తేవడానికి ఏ గోడమీద చూసినా, ఏ కంచెలో దూరినా మేమే, వినాయకుడికి ప్రతి ఇల్లూ ఓ అడవయ్యేది.

దసరా వస్తే పులివేషాలూ, ఇంటింటికీ పంతుళ్ళతో తిరిగి పప్పు బెల్లాలూ "అయ్యవారికి చాలు అయిదు వరహాలు" అని అడుక్కోవడం...

శ్రీరామనవమి వస్తే తొమ్మిది రోజులూ, పందిరి వేసినప్పటినుండీ తీసేవరకూ మేం ఇల్లు పట్టకుండా పందిళ్ళలోనే, అమ్మలూ, అత్తయ్యగార్లూ ప్రసాదాలు తయ్యారు చెయ్యడంలోనే. ఆఖరి రోజున అన్నదానానికి అందరూ తలో కూరా తరిగి తీసుకొచ్చి పులుసుపెట్టడం, గుండెగలతో అన్నం వార్చడం, అందరం కలిసి కులం మతం లేకుండా వడ్డించడం.. ఏసోబూ వడ్డించేవాడు, సందానీ వడ్డిమేవాడు. ఏడుకొండలూ వడ్డించేవాడు.

ఇప్పుడు ప్రతి ఇంట్లో ఎన్ని బొమ్మలో.. ఒక్క పిల్లవాడు మాలా వీధినపడి మోకాలి చిప్పలు డోక్కు పోయేట్లు ఆడుకోడరు, ఒక్కమ్మ కూడా కరివేపాకుకో, దబ్బాకులకో పొరుగు ఆవిడ్ని పలకరించరు. ఒక అయ్యకూడా "పేపర్ చదివారా? రేడియోలో వార్తలు విన్నారా?" అని సాయంత్రాలు పొరుగింటాయన్ని పలకరించరు. చెట్టుకి మగ్గిన జామపండ్ల రుచి ఈ కాలం పిల్లలకి తెలీదు. ఆరుబయట పడకలూ, లేవు. గుర్రం బగ్గీలో ఎక్కిన సరదాలూ లేవు. పగలూ రాత్రీ టీ.విలకి అతుక్కుపోయే అమ్మమ్మలూ, అమ్మలూ, యూ ట్యూబ్‌లలోంచి తలలెత్తని తండ్రులూ, ఇంట్లోనే కూర్చుని 'కిల్లర్ గేమ్స్' వర్చ్యువల్‌గా ఆడే పిల్లలూ "ఆజా బచ్‌పన్ ఏఖ్ బార్ ఫిర్" అన్న సుభద్ర కుమారీ చౌహాన్ పద్యం గుర్తొస్తోంది.

Post your comments










https://www.youtube.com/watch?v=ERaaX_IulS4